PRGI No. APTEL/2010/31893

# కొత్తస్వరం

తెలుగు దిన పత్రిక

బుధవారం, జూన్ 10, 2026

TG & AP

సంపుటి : 16 (Vallume : 16) | సంచిక : 6 (Issue: 6) | పేజీలు : 4 (Pages : 4) | వెల : రూ 2.00/- (Rs : 2.00/-)

## ఆహార పదార్థాలకు న్యూస్‌పేపర్ వాడొద్దు

ఎఫ్ఎస్ఎస్ఏఐ కీలక ఆదేశాలు

- పేపర్ ఇంక్‌లో క్యాన్సర్ కారక రసాయనాలు ఉన్నాయని హెచ్చరిక
- వేడి, నూనె పదార్థాల్లోకి సీసం వంటి లోహాలు చేరే ప్రమాదం
- ఫుడ్-గ్రేడ్ మెటీరియల్స్ మాత్రమే వినియోగించాలని సూచన
- నిబంధనల ఉల్లంఘనపై కఠిన చర్యలు తప్పవని స్పష్టం
- రాష్ట్రాల ఆహార భద్రతా అధికారులకు పర్యవేక్షణ ఆదేశాలు

3



# జలమండలికి చేయూత నిస్తున్న ప్రజా ప్రభుత్వం




### రూ. 7,360 కోట్లతో గోదావరి ఫేజ్-2, 3 పనులకు శ్రీకారం

- రూ. 3,849 కోట్లతో 39 కొత్త ఎస్టీపీల నిర్మాణానికి శంకుస్థాపన
- రూ. 27,232 కోట్ల విలువైన ప్రాజెక్టులకు డీపీఆర్ సిద్ధం
- 2028 నాటికి రోజువారీ నీటి సరఫరా లక్ష్యం
- 2047 నాటికి 24 ×7 తాగునీటి పంపిణీకి ప్రణాళిక
- టీసీయూఆర్ ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక మాస్టర్ ప్లాన్

హైదరాబాద్ మహానగరానికి భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా తాగునీటి సరఫరా, మురుగు నీటి నిర్వహణ వ్యవస్థలను బలోపేతం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం భారీ ప్రణాళికలకు శ్రీకారం చుట్టింది. రూ.7,360 కోట్లతో గోదావరి ఫేజ్-2, 3 తాగునీటి ప్రాజెక్టులు, రూ.3,849 కోట్లతో 39 కొత్త ఎస్టీపీల నిర్మాణ పనులను ప్రారంభిస్తూ నగర మౌలిక సదుపాయాల విస్తరణకు అడుగులు వేస్తోంది. 2028 నాటికి రోజువారీ నీటి సరఫరా, 2047 నాటికి 24X7 తాగునీటి పంపిణీ లక్ష్యంగా రూ.27,232 కోట్ల విలువైన ప్రాజెక్టులను ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా అమలు చేస్తోంది.

- కొత్తస్వరం - హైదరాబాద్



## దమ్ముంటే బహిరంగ చర్చకు రావాలి

### రేవంత్‌కు కిషన్ రెడ్డి సవాల్

- అభద్రతా భావంతోనే వ్యక్తిగత విమర్శలు
- తెలంగాణ అభివృద్ధిపై చర్చకు సిద్ధం
- ఒక్క ప్రాజెక్టు అడ్డుకున్నా రాజీనామా చేస్తా
- మెట్రో ఫేజ్-2కు కేంద్రం సూత్రప్రాయ ఆమోదం
- కాంగ్రెస్ వైఫల్యాల నుంచి దృష్టి మళ్లించే ప్రయత్నం

హైదరాబాద్, జూన్ 9 (కొత్తస్వరం): తెలంగాణ అభివృద్ధి, పెండింగ్ ప్రాజెక్టుల అంశాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగ చర్చకు రావాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సవాల్ విసిరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీల అమలులో విఫలమైందన్న విమర్శల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే సీఎం తనపై, కేంద్ర ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన కిషన్ రెడ్డి.. తెలంగాణకు రావాల్సిన ఏ ఒక్క ప్రాజెక్టును తాను అడ్డుకున్నానని నిరూపిస్తే వెంటనే రాజీనామా చేస్తానని ప్రకటించారు. ఈ అంశంపై సీనియర్ జర్నలిస్టులతో కమిటీ ఏర్పాటు చేసి విచారణ జరపాలని సూచించారు. మెట్రో ఫేజ్–2 ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే సూత్రప్రాయ ఆమోదం తెలిపిందని, తుమ్మిడి హట్టి ప్రాజెక్టుపై సీఎం చేస్తున్న ఆరోపణలు నిరాధారమని పేర్కొన్నారు. గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాల తప్పిదాల వల్ల మిగులు బడ్జెట్‌తో ఉన్న తెలంగాణ అప్పుల రాష్ట్రంగా మారిందని విమర్శించారు.



## హైదరాబాద్‌లో భారీ వర్షం..

### పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్

- తెలంగాణకు రెండ్రోజుల పాటు హెచ్చరిక
- పలు జిల్లాల్లో భారీ వర్షాల సూచన
- 40-50 కి.మీ వేగంతో ఈదురుగాలులు
- నగరంలో జలమయమైన రహదారులు
- అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచన

2





## మొహర్రం ఊరేగింపునకు విస్తృత ఏర్పాట్లు చేయాలి

- అధికారులకు మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాలు
- ఈనెల 16న జరిగే మొహర్రం ఊరేగింపుపై సమీక్ష
- ఆశూర్‌ఖానాల వద్ద పోలీసు పికెటింగ్ ఏర్పాటు
- తాగునీరు, పారిశుద్ధ్యం, వైద్య సదుపాయాల కల్పన
- బీబీ-కా-ఆలం ప్రాంతంలో పటిష్ట భద్రతా చర్యలు
- ట్రాఫిక్ అంతరాయం లేకుండా ముందస్తు ప్రణాళిక

హైదరాబాద్, జూన్ 9 (కొత్త స్వరం) : ఈనెల 16న నిర్వహించనున్న మొహర్రం ఊరేగింపుకు ప్రభుత్వం విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నట్లు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మొహర్రం ఏర్పాట్లపై రాష్ట్ర సచివాలయంలో మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి మొహమ్మద్ అజహరుద్దీన్, ప్రభుత్వ సలహాదారు మొహమ్మద్ షబ్బీర్ అలీతో కలిసి అధికారులు, ముస్లిం మత పెద్దలతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, ఆశూర్‌ఖానాల వద్ద పోలీసు పికెటింగ్ ఏర్పాటు చేయాలని, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించి రోడ్ల మరమ్మతులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అవసరమైన చోట్ల హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయడంతో పాటు తాగునీరు, పారిశుద్ధ్య సదుపాయాలు, మొబైల్ టాయిలెట్లు, వైద్య శిబిరాలు, అంబులెన్స్‌లు అందుబాటులో ఉంచాలని సూచించారు. మొహర్రం ఊరేగింపు సందర్భంగా ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, ముఖ్యంగా బీబీ–కా–ఆలం ప్రాంతంలో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ మాట్లాడుతూ, ఆశూర్‌ఖానాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, వక్ఫ్ బోర్డు ప్రతినిధులు పాల్గొన్నారు.

## శ్రీలంకలో ట్రై సిరీస్‌లో భారత్ 'ఏ' శుభారంభం

- ఉత్కంఠ పోరులో శ్రీలంక 'ఏ'పై 8 పరుగుల తేడాతో విజయం
- సెంచరీతో జట్టును ఆదుకున్న రుతురాజ్ గైక్వాడ్
- కీలక అర్ధశతకంతో మెరిసిన కెప్టెన్ తిలక్ వర్మ
- గెలుపు అంచున చేతులెత్తేసిన శ్రీలంక 'ఏ'
- చివరి ఓవర్లలో చెలరేగిన భారత బౌలర్లు
- 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా రుతురాజ్

2






## జోరు వానలోనూ మహిళా శక్తి సభ

### మహిళా సంఘాలకు 553 ఆర్టీసీ బస్సులు పంపిణీ చేసిన సీఎం రేవంత్ రెడ్డి

- హైదరాబాద్‌ను ముంచెత్తిన భారీ వర్షం
- పరేడ్ గ్రౌండ్స్‌లో ఘనంగా మహిళా శక్తి కార్యక్రమం
- వర్షంలోనే వేదికపైకి చేరుకున్న సీఎం, మంత్రులు
- స్వయం సహాయక సంఘాలకు చెక్కుల పంపిణీ
- మహిళల ఆర్థిక సాధికారతకు ప్రభుత్వం కట్టుబాటు

2



## ఢిల్లీ అగ్నిప్రమాదంలో అగర్వాల్ కుటుంబం అంతరించింది

### తనవాళ్లు ఇక లేరని తెలియకుండానే వృద్ధుడు కన్నుమూత

- ఒకే కుటుంబానికి చెందిన 8 మంది మృతి
- ఆసుపత్రిలో ఉన్న కుటుంబ పెద్దను చూసేందుకు వచ్చి ప్రమాదంలో చిక్కుకున్న బంధువులు
- శ్వాసకోశ వ్యాధితో చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి హోటల్ యజమాని, వంట మనిషిని అరెస్ట్ చేసిన పోలీసులు
- అగ్నిమాపక భద్రతా లోపాలపై దర్యాప్తు

2



## ప్రశ్నించడం ఆపేది లేదు..

### ప్రజల తరపున పోరాటం కొనసాగిస్తా

- మంత్రి టీజీ భరత్ ఫిర్యాదుపై త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌కు హాజరైన బైరెడ్డి
- రాజకీయ కక్షసాధింపులో భాగంగానే కేసులు
- ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే వేధింపులు
- ఎన్ని కేసులు పెట్టినా వెనక్కి తగ్గేది లేదు
- ప్రజల కోసం పోరాటం కొనసాగిస్తానన్న బైరెడ్డి
- జగన్ ఆదేశిస్తే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలకు సిద్ధం

2



# విశాఖ ఉక్కు పరిరక్షణకు కూటమి కట్టుబాటు

**విశాఖపట్నం, జూన్ 9 (కొత్తస్వరం) :**

విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రమాద ఘటనా స్థలిని సందర్శించిన అనంతరం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ మీడియాతో మాట్లాడారు. ప్రమాద ఘటనలో మృతిచెందిన వారి కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున పరిహారం అందజేస్తామని, క్షతగాత్రులకు రూ.10 లక్షల చొప్పున ఆర్థిక సాయం ప్రకటించారు. చికిత్సకు అయ్యే ఖర్చు మొత్తాన్ని ఆర్ఐఎన్ఎల్ భరిస్తుందని తెలిపారు. మృతుల కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం కల్పిస్తామని హామీ ఇచ్చారు. పదవీ విరమణ ప్రయోజనాల కింద రెగ్యులర్ ఉద్యోగులకు రూ.1.72 కోట్లు, కాంట్రాక్టు ఉద్యోగులకు రూ.45.75 లక్షలు అందనున్నట్లు వెల్లడించారు. స్టీల్ ప్లాంట్ ఉద్యోగుల పిల్లలకు కల్పించే సౌకర్యాల మాదిరిగానే మృతుల పిల్లల విద్యాభ్యాసం కొనసాగేందుకు అవసరమైన సహకారం అందిస్తామని పేర్కొన్నారు. ప్రమాద ఘటనపై విచారణ జరిపేందుకు బొకారో స్టీల్ ప్లాంట్ నుంచి త్రీ మ్యాన్ కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విచారణ కమిటీకి రాష్ట్ర ప్రభుత్వం పూర్తి స్థాయి సహకారం అందిస్తుందని చెప్పారు. స్టీల్ ప్లాంట్ కార్మికుల సమస్యలు, యాజమాన్య లోపాలు, సాంకేతిక ఇబ్బందులపై అవగాహన పొందేందుకు త్వరలో కార్మిక సంఘాలతో సమావేశం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. 'విశాఖ ఉక్కు.. ఆంధ్రుల హక్కు' అనే భావనకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ జరగకూడదన్నదే ప్రభుత్వ ఆకాంక్ష అని శ్రీ పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు.

# రైతులను తప్పుదోవ పట్టిస్తే జైలుకే

**అమరావతి, జూన్ 9 (కొత్తస్వరం) :**

తోతపూరి మామిడి రైతులను తప్పుదోవ పట్టిస్తూ వైసీపీ అనుబంధ సోషల్ మీడియా వర్గాలు, కొందరు రాజకీయ ప్రేరేపిత వ్యక్తులు చేస్తున్న విష ప్రచారాలపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మామిడి కొనుగోళ్లు, పల్ప్ పరిశ్రమలకు సంబంధించిన అంశాల్లో ప్రభుత్వాన్ని, ప్రజాప్రతినిధులను లక్ష్యంగా చేసుకుని వాట్సాప్ గ్రూపులు, సోషల్ మీడియా వేదికల్లో అసత్యాలు ప్రచారం చేయడం దుర్మార్గమైన చర్య అని మండిపడ్డారు. రైతుల్లో అయోమయం సృష్టించి రాజకీయ లబ్ధి పొందాలనే కుట్రలో భాగంగానే ఈ తప్పుడు ప్రచారాలు జరుగుతున్నాయని ఆరోపించారు. వైసీపీ మరోసారి తన నీచమైన, దిగజారుడు రాజకీయాలకు తెరలేపిందని మంత్రి విమర్శించారు. రైతుల సంక్షేమం వంటి సున్నితమైన అంశాలను కూడా రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవడం అత్యంత బాధ్యతారాహిత్యమని అన్నారు. ప్రజల్లో గందరగోళం సృష్టించడం, ప్రభుత్వంపై బురదజల్లడం, అబద్ధాలను నిజాలుగా చిత్రీకరించడం వైసీపీకి అలవాటుగా మారిందని ఆయన పేర్కొన్నారు. ఎవరు ఎంత దుష్ప్రచారం చేసినా ప్రభుత్వం రైతుల పక్షానే నిలుస్తుందని స్పష్టం చేశారు. ఆధారాలు లేకుండా అబద్ధాలు సృష్టించి వాట్సాప్ గ్రూపుల్లో, సోషల్ మీడియాలో వైరల్ చేస్తే సహించేది లేదని, అలాంటి వారిని గుర్తించి చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అవసరమైతే క్రిమినల్ కేసులు కూడా నమోదు చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. గత ఏడాది మామిడి రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్న సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులను ఆదుకుందని గుర్తు చేశారు. రైతులకు నష్టం జరగకుండా తీసుకున్న చర్యల వల్ల వేలాది మంది రైతులకు ఊరట లభించిందన్నారు. ఈ ఏడాది కూడా మామిడి రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. రైతులకు గిట్టుబాటు ధర లభించేలా, కొనుగోళ్ల ప్రక్రియ సజావుగా సాగేలా, పరిశ్రమలతో సమన్వయం ఉండేలా అధికారులకు ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామని చెప్పారు. రైతుల పేరుతో రాజకీయాలు చేసే వైసీపీ నేతలు, సోషల్ మీడియా ముఠాలు అసత్య ప్రచారాలు మానుకోవాలని హితవు పలికారు. రైతుల సంక్షేమంపై ప్రభుత్వానికి పూర్తి నిబద్ధత ఉందని, వారి ప్రయోజనాలను కాపాడటంలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు. మామిడి రైతులు ఎవరూ తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని, ఏ సమస్య ఉన్నా ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని మంత్రి అచ్చెన్నాయుడు విజ్ఞప్తి చేశారు.

# ప్రశ్నించడం ఆపేది లేదు.. ప్రజల తరపున పోరాటం కొనసాగిస్తా

**మంత్రి టీజీ భరత్ ఫిర్యాదుపై**
**త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌కు హాజరైన బైరెడ్డి**
**రాజకీయ కక్షసాధింపులో భాగంగానే కేసులు**
**ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే వేధింపులు**
**ఎన్ని కేసులు పెట్టినా వెనక్కి తగ్గేది లేదు**
**జగన్ ఆదేశిస్తే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలకు సిద్ధం**

**కర్నూలు, జూన్ 9 (కొత్తస్వరం) :**

ప్రజా సమస్యలపై ప్రశ్నించడం ఎప్పటికీ ఆపేది లేదని, ప్రజల తరపున తన పోరాటం కొనసాగుతుందని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బైరెడ్డి సిద్ధార్థ్ రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్ర మంత్రి టీజీ భరత్ ఫిర్యాదు మేరకు నమోదైన కేసు నేపథ్యంలో కర్నూలు త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌కు హాజరైన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. తనపై నమోదు చేసిన కేసులు రాజకీయ కక్షసాధింపులో భాగమేనని ఆరోపించారు. అధికార పార్టీ నేతలను ప్రశ్నించినందుకే తనపై కేసులు నమోదు చేస్తున్నారని, ప్రజా సమస్యలను ప్రస్తావించే వారిని భయపెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. అయితే ఎలాంటి ఒత్తిళ్లు వచ్చినా, ఎన్ని కేసులు పెట్టినా వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ప్రజల ప్రయోజనాలకు సంబంధించిన అంశాలపై నిరంతరం గళం విప్పుతానని, అన్యాయాలను ప్రశ్నిస్తూనే ఉంటానని పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశిస్తే రాష్ట్రంలో ఎక్కడైనా ప్రజా సమస్యలపై పోరాటం చేసేందుకు సిద్ధంగా ఉన్నానని బైరెడ్డి సిద్ధార్థ్ రెడ్డి తెలిపారు.

# యోగాంధ్రకు భారీ స్పందన

**అమరావతి, జూన్ 9 (కొత్తస్వరం) :**

యోగాంధ్ర–2026 కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ఈ నెల 7న ప్రారంభమైన రిజిస్ట్రేషన్లు కేవలం మూడు రోజుల్లోనే 5 లక్షలకు చేరుకోవడం విశేషంగా నిలిచింది. తొలి రోజు 25 వేల మంది మాత్రమే నమోదు చేసుకోగా, సోమవారం నుంచి రిజిస్ట్రేషన్ల సంఖ్య అనూహ్యంగా పెరుగుతోంది. యోగాసనాల్లో కోటి మందిని భాగస్వాములను చేయాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు యోగాంధ్ర పోర్టల్ ద్వారా నమోదు ప్రక్రియ కొనసాగుతోంది. ప్రస్తుతం నెలకొన్న సానుకూల వాతావరణం దృష్ట్యా త్వరలోనే కోటి మంది పేర్లు యోగాంధ్ర పోర్టల్‌లో నమోదయ్యే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. రాష్ట్రంలో అత్యధికంగా గుంటూరు జిల్లాలో 98 వేల మంది నమోదు చేసుకోగా, ఆ తరువాత నెల్లూరు, నంద్యాల, కర్నూలు, పల్నాడు జిల్లాలు నిలిచాయని ఆయుష్ డైరెక్టర్ రోణంకి గోపాలకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. యోగా అసోసియేషన్లు, గ్రామ–వార్డు సచివాలయాలు తదితర వేదికల ద్వారా రిజిస్ట్రేషన్లు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.

**లక్ష్యానికి మించి మాస్టర్ ట్రైనర్ల నమోదు..**

యోగాంధ్ర కార్యక్రమం కోసం 5,600 మంది యోగా మాస్టర్ ట్రైనర్లను నమోదు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించగా, ఇప్పటికే ఆ సంఖ్య 6,939కు చేరింది. వైఎస్సార్ కడప జిల్లాలో 412 మంది, అనకాపల్లిలో 379 మంది, అనంతపురంలో 342 మంది, కర్నూలులో 310 మంది యోగా మాస్టర్ ట్రైనర్లు తమ పేర్లు నమోదు చేసుకున్నారు. ప్రతి జిల్లాలో 200 మంది చొప్పున మాస్టర్ ట్రైనర్లను నమోదు చేయాలని ప్రభుత్వం సూచించినప్పటికీ, అనేక జిల్లాలు లక్ష్యాన్ని అధిగమించాయి. మరోవైపు యోగా ట్రైనర్ల విభాగంలో 2.5 లక్షల మందిని చేర్చాలన్న లక్ష్యానికి అనుగుణంగా ఇప్పటికే 1.88 లక్షల మంది పేర్లు యోగాంధ్ర పోర్టల్‌లో నమోదయ్యాయి. ఇందులో వైఎస్సార్ కడప జిల్లా అత్యధికంగా 9,013 మంది ట్రైనర్ల నమోదుతో ముందంజలో ఉంది. ప్రభుత్వం రూపొందించిన కార్యాచరణ ప్రణాళిక ప్రకారం జిల్లాల్లో యోగాసనాల కార్యక్రమాలు, థీమ్ ఆధారిత ఈవెంట్లు, వివిధ పోటీలు మరియు ఇతర అవగాహన కార్యక్రమాలు యథావిధిగా కొనసాగుతున్నాయి.

# వృద్ధి లక్ష్యాల సాధనకు కేపీఐలే కీలకం

**అమరావతి, కొత్తస్వరం**

రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జీఎస్‌డీపీ) లక్ష్యాలు, కీ–పెర్ఫార్మెన్స్ ఇండికేటర్ల (కేపీఐలు)పై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంగళవారం సమీక్ష నిర్వహించారు. అమరావతిలోని క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ సమావేశానికి ఆర్థిక, ప్రణాళిక, వ్యవసాయ, ఉద్యాన, రవాణా, పర్యాటక శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు. 2026–27 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిల్లో వివిధ శాఖలకు కీ–పెర్ఫార్మెన్స్ ఇండికేటర్లను ముఖ్యమంత్రి నిర్దేశించారు. జాతీయ సగటు కంటే తక్కువగా ఉన్న సూచికలను మెరుగుపరచడం, అగ్రశ్రేణి రాష్ట్రాలతో సమాన స్థాయిలో లక్ష్యాలను చేరుకోవడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. నిర్దేశించుకున్న లక్ష్యాలతో పాటు వాస్తవ వృద్ధి (రియల్ గ్రోత్) ఆధారంగా పనితీరును అంచనా వేసే విధంగా స్కోరింగ్ వ్యవస్థను అమలు చేయాలని నిర్ణయించారు. రాష్ట్ర, క్షేత్రస్థాయి ఆర్థిక పరిస్థితులను సమగ్రంగా విశ్లేషించేందుకు ప్రతి నెల 12వ తేదీన ఆర్థిక నివేదికలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. మౌలిక సదుపాయాలపై చేసే వ్యయం కనీసం 3.5 రెట్ల మేర ఆర్థిక కార్యకలాపాలను ప్రోత్సహించేలా ఉండాలని సీఎం సూచించారు. రియల్ టైమ్‌లో ఆర్థిక వ్యవహారాలను పర్యవేక్షించేందుకు ప్రత్యేక ఏఐ టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని అధికారులకు సూచించారు. 2047 స్వర్ణాంధ్ర లక్ష్యాలకు అనుగుణంగా డేటా ఆధారిత పాలనకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రతి రంగంలో గ్రాస్ వాల్యూ అడిషన్ (జీవీఏ) పెంపుపై దృష్టి సారించాలని సూచించారు. తయారీ, గనులు, వాణిజ్యం, రవాణా రంగాలతో పాటు అమరావతి, పోలవరం, పోర్టులు, విమానాశ్రయాల అభివృద్ధి ద్వారా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు మల్టిప్లయర్ ఎఫెక్ట్ వచ్చేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కీ–పెర్ఫార్మెన్స్ ఇండికేటర్లు మెరుగ్గా ఉంటే రాష్ట్ర వృద్ధి రేటు కూడా గణనీయంగా పెరుగుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

# ఏపీ ఈజ్ బ్యాక్... పెట్టుబడుల వరద

(మొదటి పేజీ తరువాయి..)

రాగా, వాటి ద్వారా సుమారు 23 లక్షల ఉద్యోగాల అవకాశాలు ఏర్పడనున్నాయి. వీటిలో రూ.21.64 లక్షల కోట్ల పెట్టుబడులు వివిధ అవగాహన ఒప్పందాల (ఎంఓయూలు) ద్వారా రావడానికి మార్గం సుగమమైంది. ఈ పెట్టుబడుల ద్వారా 21.20 లక్షల ఉద్యోగాలు లభించే అవకాశం ఉందని ప్రభుత్వం అంచనా వేస్తోంది.

**రికార్డు స్థాయిలో పెట్టుబడులు... కఠిన పర్యవేక్షణ..**

గతంలో ఎంఓయూలు కుదుర్చుకోవడానికే పరిమితమైన పరిస్థితులు ఉండేవని, ప్రస్తుతం వాటి అమలుపై ప్రత్యేక దృష్టి పెట్టామని ప్రభుత్వం చెబుతోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఐటీ మరియు పరిశ్రమల శాఖ మంత్రి నారా లోకేష్ ప్రత్యక్ష పర్యవేక్షణలో ఎంఓయూల అమలును నిరంతరం మానిటర్ చేస్తున్నారు. దేశంలో మరే రాష్ట్రంలో లేని విధంగా కుదిరిన ప్రతి ఒప్పందాన్ని ప్రత్యేకంగా పర్యవేక్షించేందుకు వ్యవస్థను ఏర్పాటు చేశారు. మూడు ప్రాంతాలకు ప్రత్యేక నోడల్ అధికారులను నియమించడంతో పాటు, జిల్లా కలెక్టర్లకు కూడా నిర్దిష్ట బాధ్యతలు అప్పగించారు. పెట్టుబడిదారుల సమస్యలను పరిష్కరించి పరిశ్రమలు త్వరగా స్థాపించేలా అధికారులు పనిచేయాలని సీఎం నిరంతరం సూచిస్తున్నారు. ఈ చర్యల ఫలితంగా దేశానికి వచ్చిన ప్రత్యక్ష విదేశీ పెట్టుబడుల్లో (FDI) 25.3 శాతం వాటా ఆంధ్రప్రదేశ్‌కు లభించినట్లు పేర్కొంటున్నారు.

**ఏపీ వైపు దిగ్గజ కంపెనీల చూపు..**

పెట్టుబడుల అమలులో ప్రభుత్వ వేగానికి AMCA ప్రాజెక్టు ఉదాహరణగా నిలిచింది. కేవలం 36 రోజుల్లోనే ఈ ప్రాజెక్టు రాష్ట్రంలో పనులు ప్రారంభించింది. అలాగే గూగుల్ డేటా సెంటర్, ఆర్సెల్లార్ మిట్టల్ వంటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులను రాష్ట్రానికి తీసుకురావడానికి కేంద్ర ప్రభుత్వంతో నిరంతర చర్చలు జరిపినట్లు ప్రభుత్వం వెల్లడించింది. రాష్ట్రానికి అనుకూలంగా నిబంధనల మార్పులు, మౌలిక సదుపాయాల కల్పన వంటి అంశాల్లో ప్రభుత్వం చొరవ చూపడంతో ఏపీ పెట్టుబడులకు ప్రధాన గమ్యస్థానంగా మారిందని అధికారులు పేర్కొంటున్నారు. రాయల్ ఎన్‌ఫీల్డ్ వంటి సంస్థలు ఇతర రాష్ట్రాలను కాదని ఆంధ్రప్రదేశ్‌ను ఎంపిక చేసుకోవడం కూడా దీనికి నిదర్శనంగా చెబుతున్నారు.

**68 శాతం ఎంఓయూలు అమలు దిశగా..**

ప్రస్తుతం కుదిరిన మొత్తం ఎంఓయూలలో 68.02 శాతం ప్రాసెస్‌లోకి వచ్చాయి. డీపీఆర్ సమర్పణ నుంచి గ్రౌండింగ్ దశ వరకు చేరిన ఎంఓయూలు 60.44 శాతంగా ఉండగా, భూ కేటాయింపు దశను పూర్తి చేసుకున్నవి 21.39 శాతంగా ఉన్నాయి. పెట్టుబడులకు అనుకూల విధానాలు, అధికారుల్లో పెరిగిన జవాబుదారీతనం, వేగవంతమైన అనుమతుల ప్రక్రియ కారణంగా పారిశ్రామిక వర్గాల్లో ఆంధ్రప్రదేశ్‌పై విశ్వాసం పెరిగిందని ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలో "ఏపీ ఈజ్ బ్యాక్" అనే నినాదం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిందని పేర్కొంటోంది. రాబోయే రోజుల్లో ఈ పెట్టుబడుల ద్వారా రాష్ట్ర యువతకు లక్షలాది ఉద్యోగ అవకాశాలు లభించే అవకాశం ఉందని వివిధ వర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి.

# శ్రీలంకలో ట్రై సిరీస్‌లో భారత్ 'ఏ' శుభారంభం

**దంబుల్లా, జూన్ 9 (కొత్తస్వరం) :**

త్రైపాక్షిక వన్డే సిరీస్‌లో భారత 'ఏ' జట్టు విజయంతో శుభారంభం చేసింది. మంగళవారం దంబుల్లా వేదికగా శ్రీలంక 'ఏ' జట్టుతో జరిగిన తొలి మ్యాచ్‌లో ఉత్కంఠభరిత పోరాటం అనంతరం 8 పరుగుల తేడాతో విజయం సాధించింది. వైస్ కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ అద్భుత శతకంతో మెరిసిపోగా, చివరి ఓవర్లలో భారత బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేసి జట్టుకు విజయాన్ని అందించారు. మొదట బ్యాటింగ్ చేసిన భారత్ 'ఏ' జట్టుకు ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. ఓపెనర్లు వైభవ్ సూర్యవంశీ (14), ప్రభ్‌సిమ్రన్ సింగ్ (2) తక్కువ స్కోరుకే వెనుదిరిగారు. ఈ పరిస్థితుల్లో కెప్టెన్ తిలక్ వర్మ (60), రుతురాజ్ గైక్వాడ్ (101) జట్టును ఆదుకున్నారు. ఇద్దరూ కీలక భాగస్వామ్యం నెలకొల్పి ఇన్నింగ్స్‌ను గాడిలో పెట్టారు. రుతురాజ్ 114 బంతుల్లో శతకం పూర్తి చేసి జట్టు స్కోరును ముందుకు నడిపించాడు. చివర్లో ఆయుష్ బదోని (24), సూర్యాన్ష్ షెడ్గే (26 నాటౌట్) వేగంగా పరుగులు సాధించడంతో భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 277 పరుగులు చేసింది. 278 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన శ్రీలంక 'ఏ' జట్టు కూడా ధీటుగా పోరాడింది. సహన్ అరాచ్చిగే (74) అద్భుత ఇన్నింగ్స్ ఆడటంతో ఒక దశలో శ్రీలంక విజయం ఖాయంగా కనిపించింది. చివరి మూడు ఓవర్లలో కేవలం 17 పరుగులు మాత్రమే అవసరమైన పరిస్థితిలో లంక జట్టు పైచేయి సాధించింది. అయితే 48వ ఓవర్లో అన్షుల్ కంబోజ్ వేసిన అద్భుత యార్కర్‌కు అరాచ్చిగే ఔటవడంతో మ్యాచ్ పూర్తిగా మలుపు తిరిగింది. అనంతరం అర్షద్ ఖాన్ కీలక వికెట్లు పడగొట్టడంతో శ్రీలంక 'ఏ' జట్టు 48.5 ఓవర్లలో 269 పరుగులకు ఆలౌటైంది. శతకంతో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించిన రుతురాజ్ గైక్వాడ్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది. ఈ త్రైపాక్షిక సిరీస్‌లో భారత్ 'ఏ', శ్రీలంక 'ఏ'తో పాటు ఆఫ్ఘనిస్థాన్ 'ఏ' జట్లు పోటీపడుతున్నాయి.

# జలమండలికి చేయూతనిస్తున్న ప్రజా ప్రభుత్వం

**కొత్తస్వరం హైదరాబాద్:**

హైదరాబాద్ మహానగర ప్రజలకు మెరుగైన తాగునీటి సరఫరా, మురుగు నీటి నిర్వహణ సేవలను అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం భారీ ప్రణాళికలతో ముందుకు సాగుతోంది. జలమండలి ఆధ్వర్యంలో రూ. 7,360 కోట్ల వ్యయంతో గోదావరి తాగునీటి సరఫరా పథకం ఫేజ్–2, ఫేజ్–3 పనులకు శ్రీకారం చుట్టగా, రూ. 3,849.10 కోట్లతో 39 కొత్త మురుగు నీటి శుద్ధి కేంద్రాల (ఎస్టీపీలు) నిర్మాణానికి శంకుస్థాపన జరిగింది. కోటిన్నర మందికి పైగా జనాభా కలిగిన హైదరాబాద్ నగరానికి ప్రస్తుతం రోజుకు 602 ఎంజీడీల నీటిని సరఫరా చేస్తున్న జలమండలి, 2027 నాటికి పెరిగే అవసరాలను దృష్టిలో ఉంచుకుని అదనంగా 300 ఎంజీడీల నీటిని అందించేందుకు గోదావరి ఫేజ్–2, 3 ప్రాజెక్టులను చేపట్టింది. మల్లన్నసాగర్ నుంచి 20 టీఎంసీల నీటిని తరలించే ఈ ప్రాజెక్టు ద్వారా నగర తాగునీటి అవసరాలతో పాటు మూసీ నది పునరుజ్జీవనానికి కూడా తోడ్పాటు అందనుంది. ఈ ప్రాజెక్టు కింద ఘన్‌పూర్, శామీర్‌పేట్ వద్ద భారీ నీటి శుద్ధి కేంద్రాలు, పంప్ హౌస్‌లు, సబ్‌స్టేషన్లు, పైప్‌లైన్ నెట్‌వర్క్ నిర్మించనున్నారు. 2027 డిసెంబర్ నాటికి పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. మరోవైపు, మహానగరంలో 100 శాతం మురుగు నీటి శుద్ధి లక్ష్యంతో అమృత్–2.0 పథకం కింద 972 ఎంఎల్డీ సామర్థ్యంతో 39 కొత్త ఎస్టీపీల నిర్మాణం చేపడుతున్నారు. రూ. 3,849.10 కోట్లతో నిర్మితమయ్యే ఈ ప్రాజెక్టులు ఔటర్ రింగ్ రోడ్ పరిధిలోని పట్టణాలు, గ్రామాలకు ఉపయోగపడనున్నాయి. ఇవి పూర్తయితే మొత్తం మురుగు నీటి శుద్ధి సామర్థ్యం 2,850 ఎంఎల్డీలకు చేరి 2036 వరకు అవసరాలను తీర్చగలదని అధికారులు అంచనా వేస్తున్నారు. మూసీ నది కాలుష్య నివారణకు రూ. 4,700 కోట్లతో ట్రంక్ లైన్ల నిర్మాణానికి డీపీఆర్ సిద్ధం కాగా, జీహెచ్ఎంసీ పరిధిలో మురుగు ప్రవాహాలను అరికట్టేందుకు రూ. 6,677 కోట్లతో సమగ్ర సేవర్ నెట్‌వర్క్ ప్రాజెక్టును ప్రతిపాదించారు. చాంద్రాయణగుట్టలో మురుగు నీటి నెట్‌వర్క్ బలోపేతానికి రూ. 301 కోట్ల ప్రాజెక్టును కూడా చేపట్టారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని టీసీయూఆర్ ప్రాంతానికి ప్రత్యేక మాస్టర్ ప్లాన్ రూపొందిస్తున్నారు. 2028 నాటికి రోజువారీ తాగునీటి సరఫరా, 2047 నాటికి 24 గంటల నిరంతర నీటి సరఫరా లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేశారు. జలమండలి ఆధ్వర్యంలో చేపట్టనున్న తాగునీటి, మురుగు నీటి పారుదల ప్రాజెక్టుల మొత్తం విలువ సుమారు రూ. 27,231.93 కోట్లుగా ఉండగా, నగర భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా సమగ్ర అభివృద్ధి చర్యలు కొనసాగుతున్నాయి.

# హైదరాబాద్‌లో భారీ వర్షం.. పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్

**హైదరాబాద్, జూన్ 9 (కొత్తస్వరం):**

నైరుతి రుతుపవనాల ఆగమనానికి ముందే తెలంగాణలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. మంగళవారం సాయంత్రం హైదరాబాద్‌ను భారీ వర్షం ముంచెత్తగా, రాష్ట్రంలోని పలు జిల్లాలకు భారత వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది. రానున్న రెండు రోజుల పాటు ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. హైదరాబాద్ వాతావరణ కేంద్రం అంచనాల ప్రకారం రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. బుధవారం వికారాబాద్, మహబూబ్‌నగర్, నారాయణపేట, గద్వాల జిల్లాల్లో ఇదే తరహా వాతావరణం కొనసాగనుంది. గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని అధికారులు తెలిపారు. హైదరాబాద్‌లో కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ, మియాపూర్, హైటెక్ సిటీ, చందానగర్, ముషీరాబాద్, లక్డీకాపూల్, కోఠి, అబిడ్స్, బషీర్‌బాగ్, ట్యాంక్‌బండ్ తదితర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. రోడ్లపై నీరు నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈదురుగాలుల ధాటికి రాంనగర్ వీఎస్టీ రోడ్డు, హైదర్‌గూడ ప్రాంతాల్లో చెట్లు కూలిపోగా, పలుచోట్ల విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

# పట్టణాల అభివృద్ధికి భారీ ప్రణాళికలు

**విజయవాడ, జూన్ 9 (కొత్తస్వరం) :**

రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు సాగుతోందని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. విజయవాడలో హడ్కో ఆధ్వర్యంలో నిర్వహించిన అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కెపాసిటీ బిల్డింగ్ వర్క్‌షాప్‌ను మంగళవారం ప్రారంభించిన ఆయన, రాబోయే మూడేళ్లలో ప్రజల ప్రాథమిక అవసరాలకు అత్యున్నత ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు వెల్లడించారు. నాణ్యమైన తాగునీటి సరఫరా, ఘన వ్యర్థాల నిర్వహణ, వాడుక నీటి నిర్వహణ, అంతర్గత రోడ్ల అభివృద్ధి, వీధి దీపాల ఏర్పాటు వంటి ఐదు ప్రధాన అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. పట్టణాల అభివృద్ధికి హడ్కో అందిస్తున్న సాంకేతిక, ఆర్థిక మార్గదర్శకాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రతి ఇంటికి తాగునీటి కుళాయి కనెక్షన్ అందించేందుకు రూ.17,394 కోట్ల అంచనాతో ప్రణాళికలు రూపొందించినట్లు మంత్రి తెలిపారు. అమృత్ 1.0, అమృత్ 2.0, UIDF, AIIB పథకాల కింద ఇప్పటికే రూ.12,395 కోట్ల విలువైన పనులు ప్రారంభమైనట్లు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కచ్చా డ్రైన్లను శాశ్వత డ్రైన్లుగా మార్చేందుకు దాదాపు రూ.29 వేల కోట్లు అవసరమవుతాయని పేర్కొన్నారు. జనసాంద్రత ఆధారంగా ప్రాంతాలను హై, మీడియం, లో డెన్సిటీ విభాగాలుగా విభజించి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. తొలి విడతలో హై, మీడియం డెన్సిటీ ప్రాంతాల్లో రూ.9 వేల కోట్లతో డ్రైనేజీ పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం కేటాయించిన అర్బన్ క్లియరెన్స్ ఫండ్ ద్వారా రాష్ట్రానికి లభించే రూ.3,600 కోట్లతో పాటు రాష్ట్ర వాటా నిధులను హడ్కో, ఇతర బ్యాంకుల ద్వారా సమీకరించేందుకు 72 మున్సిపాలిటీలకు రీపేమెంట్ సామర్థ్యం ఉందన్నారు. మిగిలిన మున్సిపాలిటీల్లో రూ.5 వేల కోట్ల పనులను యాన్యుటీ మోడల్ ద్వారా చేపట్టేందుకు ఆర్థిక శాఖ అనుమతి ఇచ్చిందని వెల్లడించారు. అవసరం లేని చోట మంచి రోడ్లు, డ్రైన్లను తొలగించి కొత్త నిర్మాణాలు చేపట్టవద్దని ఇంజనీర్లు, అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు మంత్రి తెలిపారు. ప్రజాప్రతినిధుల ఒత్తిళ్లకు లోనుకాకుండా నిజంగా అవసరమైన ప్రాంతాల్లో మాత్రమే పనులు చేపట్టాలని సూచించారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో పట్టణాల్లో డ్రైన్ల పూడికతీత పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. కేంద్రం నుంచి ఈ నెలలోనే రూ.3,600 కోట్ల నిధులు రానున్నందున, మూడు నెలల్లో అన్ని డీపీఆర్‌లు సిద్ధం చేసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని మంత్రి నారాయణ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా హడ్కో చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సంజయ్ కుల్ శ్రేష్ఠ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ జాతీయ సగటు కంటే వేగంగా అభివృద్ధి చెందుతోందని ప్రశంసించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారాయణ నాయకత్వంలో రాష్ట్రం పట్టణాభివృద్ధి రంగంలో ముందంజలో ఉందన్నారు. పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రధాన కార్యదర్శి ఎస్. సురేష్ కుమార్ మాట్లాడుతూ మున్సిపాలిటీలు ఆర్థికంగా బలోపేతం కావాలంటే బ్యాంకబుల్ ప్రాజెక్టుల రూపకల్పన అత్యవసరమని పేర్కొన్నారు. మున్సిపల్ సేవలను ప్రైవేటీకరిస్తున్నారనే ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని స్పష్టం చేశారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ పి. సంపత్ కుమార్ మాట్లాడుతూ పట్టణ స్థానిక సంస్థలు కేవలం ప్రభుత్వ గ్రాంట్లపై ఆధారపడకుండా స్వంత ఆదాయ వనరులను పెంపొందించుకోవాలని సూచించారు. ప్రాజెక్టుల ఆధారిత కొత్త ఆర్థిక విధానాల ద్వారా పట్టణ సంస్థలు ఆర్థిక స్వావలంబన సాధించాల్సిన అవసరం ఉందన్నారు.

# జోరు వానలోనూ మహిళా శక్తి సభ

**హైదరాబాద్, జూన్ 9 (కొత్తస్వరం) :**

హైదరాబాద్ నగరాన్ని భారీ వర్షం ముంచెత్తినప్పటికీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన అధికారిక కార్యక్రమాలను కొనసాగించారు. మహిళల ఆర్థిక సాధికారత లక్ష్యంగా సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన 'మహిళా శక్తి' మహాసభలో పాల్గొని మహిళా స్వయం సహాయక సంఘాలకు 553 కొత్త ఆర్టీసీ బస్సులను పంపిణీ చేశారు. సభ జరుగుతున్న సమయంలో నగర వ్యాప్తంగా కుండపోత వర్షం కురిసినా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తదితరులు వర్షాన్ని లెక్కచేయకుండా వేదిక వద్దకు చేరుకున్నారు. అనంతరం ముఖ్యమంత్రి జెండా ఊపి బస్సులను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వయం సహాయక సంఘాలకు సంబంధించిన హైర్ ఛార్జీల చెక్కులను కూడా ముఖ్యమంత్రి అందజేశారు. మహిళలకు ఆర్థికంగా మరింత బలం చేకూర్చాలనే లక్ష్యంతో ప్రభుత్వం 'ఇందిరా మహిళా శక్తి' వంటి పథకాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. ఈ పథకం కింద మహిళా సంఘాలు కొనుగోలు చేసిన బస్సులను తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీఎస్ఆర్టీసీ)కు లీజు ప్రాతిపదికన అందజేస్తారు. మహిళల ఆదాయ వనరులను పెంచడంతో పాటు స్వయం ఉపాధి అవకాశాలను విస్తరించే దిశగా ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

# ఢిల్లీ అగ్నిప్రమాదంలో అగర్వాల్ కుటుంబం అంతరించింది

**తనవాళ్లు ఇక లేరని తెలియకుండానే వృద్ధుడు కన్నుమూత**
**ఒకే కుటుంబానికి చెందిన 8 మంది మృతి**
**శ్వాసకోశ వ్యాధితో చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి**
**హోటల్ యజమాని, వంట మనిషిని అరెస్ట్ చేసిన పోలీసులు**
**అగ్నిమాపక భద్రతా లోపాలపై దర్యాప్తు**

**న్యూఢిల్లీ, జూన్ 9 (కొత్తస్వరం) :**

ఢిల్లీలో ఇటీవల జరిగిన ఘోర అగ్నిప్రమాదంలో హృదయవిదారక ఘటన వెలుగుచూసింది. ప్రమాదంలో తన కుటుంబ సభ్యులు ఎనిమిది మందిని కోల్పోయిన విషయం తెలియకుండానే 80 ఏళ్ల రాధే శ్యామ్ అగర్వాల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం కన్నుమూశారు. దీంతో గురుగ్రామ్‌కు చెందిన అగర్వాల్ కుటుంబంలో ఎవరూ మిగలకుండా పోయారు. శ్వాసకోశ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న రాధే శ్యామ్ అగర్వాల్ ఢిల్లీలోని సాకేత్ మాక్స్ ఆసుపత్రి ఐసీయూలో చికిత్స పొందుతున్నారు. ఆయనను పరామర్శించేందుకు కుమారుడు వివేక్ అగర్వాల్, కోడలు, మనవరాళ్లతో పాటు కుటుంబ సభ్యులు మొత్తం ఎనిమిది మంది ఢిల్లీకి వచ్చారు. ఆసుపత్రికి సమీపంలోని మాల్వియా నగర్‌లో ఉన్న 'ఫ్లరిష్ స్టే' హోటల్‌లో వారు బస చేశారు. జూన్ 3న ఉదయం హోటల్ వంటగదిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగడంతో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో వివేక్ అగర్వాల్ కుటుంబ సభ్యులు ఎనిమిది మందితో పాటు మొత్తం 21 మంది మృతి చెందారు. తన కుటుంబానికి ఇంతటి విషాదం జరిగిందన్న విషయం తెలియని రాధే శ్యామ్ అగర్వాల్, తన కుటుంబ సభ్యులు ఎందుకు రావడం లేదని ఆసుపత్రి సిబ్బందిని తరచూ అడుగుతుండేవారని సమాచారం. అయితే ఆ విషయాన్ని ఆయనకు తెలియజేయకుండా కుటుంబ సభ్యులు జాగ్రత్త పడ్డారు. చివరకు ఆయన కూడా చికిత్స పొందుతూ మృతి చెందడంతో అగర్వాల్ కుటుంబం పూర్తిగా అంతరించిపోయింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన ఢిల్లీ పోలీసులు హోటల్ యజమాని లవకేశ్ బజాజ్, వంట మనిషి కేశవ్ నేగిని అరెస్ట్ చేశారు. భవన నిర్మాణం, అగ్నిమాపక భద్రతా నిబంధనల్లో తీవ్ర లోపాలు ఉన్నట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ విషాద ఘటనతో గురుగ్రామ్‌లోని అగర్వాల్ కుటుంబ నివాసం శోకసంద్రంగా మారింది.

## ఆహార పదార్థాలకు న్యూస్‌పేపర్ వాడొద్దు

**ఎఫ్ఎస్ఎస్ఏఐ కీలక ఆదేశాలు**

**పేపర్ ఇంక్‌లో క్యాన్సర్ కారక రసాయనాలు ఉన్నాయని హెచ్చరిక**

**వేడి, నూనె పదార్థాల్లోకి సీసం వంటి లోహాలు చేరే ప్రమాదం**

**ఫుడ్-గ్రేడ్ మెటీరియల్స్ మాత్రమే వినియోగించాలని సూచన**

**నిబంధనల ఉల్లంఘనపై కఠిన చర్యలు తప్పవని స్పష్టం**

**రాష్ట్రాల ఆహార భద్రతా అధికారులకు పర్యవేక్షణ ఆదేశాలు**

**న్యూఢిల్లీ, జూన్ 9 (కొత్తస్వరం) :**

ఆహార పదార్థాల ప్యాకింగ్, నిల్వ, పంపిణీ కోసం వార్తాపత్రికలను వినియోగించరాదని భారత ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) మరోసారి స్పష్టం చేసింది. వీధి వ్యాపారులు, రెస్టారెంట్లు, క్లౌడ్ కిచెన్లు సహా అన్ని రకాల ఆహార విక్రయ సంస్థలు ఈ నిబంధనను తప్పనిసరిగా అమలు చేయాలని ఆదేశించింది. వార్తాపత్రికల ముద్రణలో ఉపయోగించే ఇంక్‌లో సీసం (లెడ్) వంటి ప్రమాదకర భారీ లోహాలు, ఇతర హానికర రసాయనాలు ఉంటాయని ఎఫ్ఎస్ఎస్ఏఐ పేర్కొంది. ముఖ్యంగా సమోసా, పకోడీ, వడ వంటి వేడి, నూనె పదార్థాలను పేపర్లలో చుట్టినప్పుడు ఆ రసాయనాలు ఆహారంలోకి చేరే అవకాశం ఉందని హెచ్చరించింది. ఇలాంటి కలుషిత ఆహారాన్ని తరచుగా తీసుకోవడం వల్ల క్యాన్సర్, జీర్ణకోశ వ్యాధులు, మూత్రపిండాల సమస్యలు, మెదడు పనితీరుపై ప్రతికూల ప్రభావాలు ఏర్పడే ప్రమాదం ఉందని తెలిపింది. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు, రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారికి ఈ ముప్పు మరింత ఎక్కువగా ఉంటుందని పేర్కొంది. ఇటీవల ముంబైలోని ఓ ప్రముఖ వడపావ్ విక్రయ కేంద్రంలో వార్తాపత్రికలను ఆహార పదార్థాల కోసం వినియోగిస్తున్నట్లు ఎఫ్ఎస్ఎస్ఏఐ, బృహన్‌ముంబై మున్సిపల్ కార్పొరేషన్ సంయుక్త తనిఖీల్లో గుర్తించాయి. ఈ నేపథ్యంలో తాజా ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడించింది. గతంలో 2016, 2023 సంవత్సరాల్లో కూడా ఇదే అంశంపై మార్గదర్శకాలు విడుదల చేసిన ఎఫ్ఎస్ఎస్ఏఐ, ఆహార పదార్థాలపై అదనపు నూనె తొలగించేందుకు కూడా వార్తాపత్రికలను ఉపయోగించరాదని మరోసారి స్పష్టం చేసింది. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ (ప్యాకేజింగ్) రెగ్యులేషన్స్-2018 ప్రకారం, ఆహార పదార్థాల నిల్వ, సరఫరా కోసం కేవలం ఫుడ్-గ్రేడ్ మెటీరియల్స్ మాత్రమే వినియోగించాలని సూచించింది. నిబంధనల అమలును క్షేత్రస్థాయిలో కఠినంగా పర్యవేక్షించాలని అన్ని రాష్ట్రాల ఆహార భద్రతా అధికారులను ఎఫ్ఎస్ఎస్ఏఐ ఆదేశించింది.

# వేంపెంట శ్రీరామాలయ పునఃప్రతిష్ఠ మహోత్సవానికి ఘన ఏర్పాట్లు

## జూన్ 15, 16, 17 తేదీల్లో మూడు రోజులపాటు వైభవంగా వేడుకలు

### అందరికీ ఆహ్వాన పత్రికలు అందజేసిన ఆలయ చైర్మన్ టేకూరి రామసుబ్బమ్మ


### 98 ఏళ్ల చరిత్రకు నూతన అధ్యాయం ప్రారంభమవుతుందని డా. టేకూరి నాగేశ్వరరావు వెల్లడి


### వేదమంత్ర ఘోషల మధ్య యాగాలు, హోమాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు


### రాజకీయాలకు అతీతంగా భక్తులు పాల్గొనాలని నిర్వాహకుల పిలుపు

**పాములపాడు, జూన్ 9 (కొత్తస్వరం) :**

నంద్యాల జిల్లా నందికొట్కూరు నియోజకవర్గం పాములపాడు మండలం వేంపెంట గ్రామంలోని శ్రీ సీతారామలక్ష్మణ హనుమత్సమేత శిఖర ధ్వజ ప్రతిష్ఠా మహోత్సవాన్ని ఈ నెల 15, 16, 17 తేదీల్లో ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ టేకూరి రామసుబ్బమ్మ తెలిపారు. మహోత్సవానికి హాజరుకావాలని కోరుతూ ఎమ్మెల్యే గిత్త జయసూర్య, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి సహా ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, కార్యకర్తలు, మీడియా ప్రతినిధులకు ఆహ్వాన పత్రికలు అందజేశారు. ఈ సందర్భంగా సింగపూర్ తెలుగు సమాజం ఉపాధ్యక్షుడు, హ్యూమన్ రైట్స్ అవార్డు గ్రహీత, అంతర్జాతీయ సామాజిక సేవకుడు డాక్టర్ టేకూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ, వేంపెంట శ్రీరామాలయ 98 సంవత్సరాల చరిత్రకు పునఃప్రతిష్ఠ మహోత్సవం ద్వారా నూతన అధ్యాయం ప్రారంభమవుతోందన్నారు. 2019 మార్చి 31న స్వర్గీయ టేకూరి గాండ్ల కృష్ణుడు, టేకూరి రామసుబ్బమ్మ తదితర పెద్దల సమక్షంలో ఆలయ పునర్నిర్మాణానికి పునాదులు వేసినట్లు గుర్తుచేశారు. పూర్వీకులు భక్తిశ్రద్ధలతో నిర్మించిన శ్రీరామాలయం భగవంతుని కృప, భక్తుల విశ్వాసం, గ్రామ ప్రజల సహకారం, ప్రభుత్వ అండదండలతో మరలా నూతన కాంతులు సంతరించుకుని భక్తులకు దర్శనమివ్వబోతోందన్నారు. శ్రీరాముని సంకల్పమే ఈ మహత్తర కార్యానికి మూలమని పేర్కొన్నారు. ఆలయ చైర్మన్ టేకూరి రామసుబ్బమ్మ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ మహోత్సవాల్లో మూడు రోజులపాటు వేదమంత్ర ఘోషల మధ్య యాగాలు, హోమాలు, వైదిక పూజలు, భక్తి సంగీత కార్యక్రమాలు, ఆధ్యాత్మిక వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తుల కోసం అన్నప్రసాదం, వసతి సదుపాయాలు కల్పించినట్లు వెల్లడించారు. బాహుబలి హనుమాన్ శోభాయాత్ర, చెక్క భజనలు, కోలాటం వంటి ప్రత్యేక కార్యక్రమాలు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయని చెప్పారు. సింగపూర్ నుంచి స్వయంగా వచ్చి కార్యక్రమాలను పర్యవేక్షించడం, స్వామివారి సేవలో భాగస్వామ్యం కావడం ఆనందంగా ఉందన్నారు.













రాజకీయాలకు అతీతంగా వేంపెంటతో పాటు పరిసర గ్రామాల ప్రజలు, పాములపాడు మండల వాసులు, భక్తులు కుటుంబ సమేతంగా విచ్చేసి శ్రీ సీతారామచంద్ర స్వామివారి దివ్య ఆశీస్సులు పొందాలని నిర్వాహకులు హృదయపూర్వకంగా ఆహ్వానించారు.

## అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు

**రైతులకు ఎరువుల పంపిణీ కార్యక్రమం**

**నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు**

**రైతులకు స్వేచ్ఛగా కొనుగోలు అవకాశం**

**అవగాహన కల్పించిన వ్యవసాయ అధికారులు**

**కార్యక్రమంలో సిబ్బంది పాల్గొనిక**



**ఆత్మకూరు, జూన్ 9 (కొత్తస్వరం ప్రతినిధి):**

రైతులకు అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే శాఖాపరమైన కఠిన చర్యలు తప్పవని ఆత్మకూరు మండల వ్యవసాయ అధికారి హేమలత హెచ్చరించారు. మండలంలోని వసుంధర ఫర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ దుకాణంలో యూరియా, డీఏపీ పంపిణీ కార్యక్రమాన్ని ఆమె ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా హేమలత మాట్లాడుతూ, ఎరువుల దుకాణ యజమానులు నిర్ణీత ధరలకే ఎరువులను విక్రయించాలని సూచించారు. రైతులు ఒకే దుకాణంలో యూరియా, డీఏపీ కొనుగోలు చేయాల్సిన అవసరం లేదని, తమకు నచ్చిన ఎరువుల దుకాణంలో అవసరమైన ఎరువులను కొనుగోలు చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి సతీష్‌తో పాటు వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## మిడ్తూరును ఆదర్శ మండలంగా తీర్చిదిద్దుతాం

**ఎమ్మెల్యే గిత్త జయసూర్య**





**మిడ్తూరు, జూన్ 9 (కొత్తస్వరం) :**

నందికొట్కూరు నియోజకవర్గంలోని మిడ్తూరు మండల ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే గిత్త జయసూర్య హాజరై అధికారులు, ప్రజాప్రతినిధులకు అభివృద్ధి కార్యక్రమాలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి కోసం కోట్ల రూపాయల నిధులు తీసుకువచ్చామని, సిమెంట్ రోడ్లు, తాగునీటి, డ్రైనేజీ పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. అభివృద్ధి అంశాలపై చర్చించాలే గానీ రాజకీయాలకు ప్రాధాన్యం ఇవ్వవద్దని ప్రతిపక్షాలకు సూచించారు. వర్షాధార పంటలపై ఆధారపడటం వల్ల రైతులు నష్టపోతున్నారని పేర్కొన్న ఆయన, మిడ్తూరు రైతులు ఉద్యాన పంటల వైపు మళ్లాలని పిలుపునిచ్చారు. టమాటా, మిర్చి, బొప్పాయి, జామ వంటి పంటల సాగుతో ఆదాయం మూడు రెట్లు పెరిగే అవకాశం ఉందని, ఉద్యానశాఖ ద్వారా సబ్సిడీలు అందించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను 100 శాతం అమలు చేస్తుందని, అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తే మిడ్తూరు మండలాన్ని ఆదర్శ మండలంగా తీర్చిదిద్దగలమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. అనంతరం సీఎం సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా మిడ్తూరు మండలం రోల్లపాడు గ్రామానికి చెందిన కురువ మద్దమ్మకు మంజూరైన రూ.1.11 లక్షల ఆర్థిక సహాయ చెక్కును కూటమి నాయకులతో కలిసి ఎమ్మెల్యే గిత్త జయసూర్య అందజేశారు.





## బీజేపీ నందికొట్కూరు రూరల్ మండల సమావేశం నిర్వహణ

**నందికొట్కూరు, జూన్ 9 (కొత్తస్వరం) :**

భారతీయ జనతా పార్టీ (బీజేపీ) నందికొట్కూరు రూరల్ మండల సమావేశం మండలంలోని బొల్లవరం గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి బీజేపీ మండల అధ్యక్షులు ప్రొఫెసర్ డాక్టర్ వీరం మురళీధరరెడ్డి అధ్యక్షత వహించారు. సమావేశంలో పార్టీ బలోపేతం, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రచారం, గ్రామస్థాయిలో పార్టీ కార్యకలాపాల విస్తరణపై చర్చించారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కార్యకర్తలు సమిష్టిగా పనిచేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, పీ. రాజేశ్వర రెడ్డి, కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, పార్టీ కార్యకర్తలు, గ్రామస్థాయి నాయకులు పాల్గొన్నారు. పార్టీ అభివృద్ధి, భవిష్యత్ కార్యాచరణపై నాయకులు కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.

# ఆన్‌లైన్ పెట్టుబడి మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

**భారీ లాభాల ఆశ చూపే నకిలీ పెట్టుబడి పథకాలను నమ్మవద్దు**

**వాట్సాప్, టెలిగ్రామ్, ఫేస్‌బుక్ గ్రూపుల ద్వారా సైబర్ నేరగాళ్ల వల**

**సెబీ గుర్తింపు లేని పెట్టుబడి సంస్థలకు దూరంగా ఉండాలని సూచన**

**సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930కు ఫిర్యాదు చేయాలి**

**అప్రమత్తతే సైబర్ నేరాల నివారణకు ప్రధాన ఆయుధం: ఎస్పీ విక్రాంత్ పాటిల్**

**కర్నూలు, జూన్ 9 (కొత్తస్వరం) :**

ఇటీవలి కాలంలో ఆన్‌లైన్ పెట్టుబడి మోసాలు గణనీయంగా పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ సూచించారు. మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, సైబర్ నేరగాళ్లు తక్కువ కాలంలో భారీ లాభాలు వస్తాయని, ఐపీఓల్లో ప్రత్యేక అవకాశాలు ఉన్నాయని, క్రిప్టో ట్రేడింగ్ ద్వారా అధిక ఆదాయం పొందవచ్చని నమ్మించి ప్రజలను మోసం చేస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా వాట్సాప్, టెలిగ్రామ్, ఫేస్‌బుక్ వంటి సోషల్ మీడియా వేదికల ద్వారా నకిలీ పెట్టుబడి గ్రూపులను ఏర్పాటు చేసి అమాయకులను తమ వలలోకి దింపుతున్నారని హెచ్చరించారు. మొదట చిన్న మొత్తాలను పెట్టుబడిగా తీసుకుని కొంత లాభం వచ్చినట్లు చూపిస్తూ నమ్మకం కల్పించి, అనంతరం పెద్ద మొత్తాల్లో పెట్టుబడులు పెట్టించేలా ప్రలోభాలకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు. డబ్బులు జమ చేసిన తర్వాత నేరగాళ్లు సంబంధాలు తెంచుకుని బాధితులను మోసం చేస్తున్నారని తెలిపారు. పెట్టుబడులు పెట్టే ముందు సంబంధిత సంస్థ లేదా ప్లాట్‌ఫారమ్‌కు భారతీయ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ (SEBI) గుర్తింపు ఉందో లేదో తప్పనిసరిగా ధృవీకరించుకోవాలని సూచించారు. అపరిచిత వ్యక్తులు పంపే లింకులు, యాప్‌లు లేదా పెట్టుబడి ఆహ్వానాలను నమ్మి డబ్బులు పంపరాదన్నారు. అలాగే ఓటీపీలు, యూపీఐ పిన్‌లు, బ్యాంకు ఖాతా వివరాలు, డెబిట్ లేదా క్రెడిట్ కార్డు సమాచారాన్ని ఎవరితోనూ పంచుకోవద్దని సూచించారు. అనుమానాస్పద లింకులను క్లిక్ చేయకుండా, తెలియని యాప్‌లను మొబైల్ ఫోన్లలో ఇన్‌స్టాల్ చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. సైబర్ మోసానికి గురైనట్లయితే ఆలస్యం చేయకుండా వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని, లేదా జాతీయ సైబర్ క్రైమ్ పోర్టల్ లో ఫిర్యాదు నమోదు చేయాలని ఎస్పీ సూచించారు. త్వరగా ఫిర్యాదు చేస్తే మోసపోయిన నగదును తిరిగి పొందే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని పేర్కొంటూ, అప్రమత్తతే సైబర్ నేరాల నివారణకు ప్రధాన ఆయుధమని ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు.




**పాత్రికేయులు కావలెను**

కొత్తస్వరం దినపత్రికకు అనుభవం కలిగిన, వార్తా కథనాలు (స్టోరీలు) రాయగలిగే పాత్రికేయ మిత్రులు కావలెను.

నంద్యాల జిల్లా నందికొట్కూరు నియోజకవర్గ పరిధిలోని ప్రాంతాలకు రిపోర్టర్లు అవసరం

నందికొట్కూరు - నందికొట్కూరు రూరల్ - పగిడ్యాల - జూపాడుబంగ్లా - కొత్తపల్లె - పాములపాడు - మిడుతూరు

కొత్తస్వరం 9492813364

కొత్తస్వరం
తెలుగు దిన పత్రిక
కర్నూలు - నంద్యాల
బుధవారం, జూన్ 10, 2026 | పేజీ 4

# స్టీల్ ప్లాంట్ బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం: మంత్రి లోకేశ్

**విశాఖపట్నం, జూన్ 9 (కొత్త స్వరం):**
విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రమాద బాధిత కుటుంబాలను మంత్రి Nara Lokesh మంగళవారం పరామర్శించారు. కేజీహెచ్ ఆస్పత్రికి చేరుకున్న ఆయన ప్రమాదంలో మృతి చెందిన ఎనిమిది మంది కార్మికుల కుటుంబ సభ్యులను కలిసి ఓదార్చారు. అనంతరం సెవెన్ హిల్స్ ఆస్పత్రికి వెళ్లిన మంత్రి, చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. గాయపడిన వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా చర్యలు చేపడతామని లోకేశ్ తెలిపారు. ఆయన వెంట కేంద్ర మంత్రి Bhoopathi Raju Srinivasa Varma, హోంమంత్రి Vangalapudi Anitha, ఎంపీ M. Sribharat తదితరులు ఉన్నారు. కాగా, స్టీల్ ప్లాంట్‌లో జరిగిన ఘోర ప్రమాదంలో ఎనిమిది మంది కార్మికులు మృతి చెందగా, పలువురు గాయపడ్డారు. మృతదేహాలను గుర్తించేందుకు డీఎన్ఏ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వైద్యులు తెలిపారు. గాయపడిన వారు విశాఖపట్నంలోని ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు.

# నెలాఖరులోగా నెట్ జీరో హెల్తీ క్యాంపస్‌లు ఏర్పాటు చేయాలి





స్వర్ణాంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర లక్ష్యాల సాధనపై కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి ఆదేశాలు

50 విద్యాసంస్థలను పర్యావరణ హిత కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు చర్యలు

సోలార్ ప్యానెల్లు, రైన్ వాటర్ హార్వెస్టింగ్, వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై ప్రత్యేక దృష్టి

నెలాఖరులోగా అన్ని పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచన

నెట్ జీరో పర్యవేక్షణకు 'కన్హా హార్ట్‌ఫుల్‌నెస్'తో ఒప్పంద పత్రం అందజేత

**కర్నూలు, జూన్ 9 (కొత్తస్వరం) :**
స్వర్ణాంధ్ర–స్వచ్ఛ ఆంధ్ర లక్ష్యాల సాధనలో భాగంగా జిల్లాలో నెట్ జీరో హెల్తీ క్యాంపస్‌ల ఏర్పాటును ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో వివిధ శాఖల అధికారులతో నెట్ జీరో, హెల్తీ క్యాంపస్‌ల ఏర్పాటుకు సంబంధించిన అంశాలపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అల్ట్రా హై డెన్సిటీ మొక్కల పెంపకానికి అనుకూలంగా ఉన్న 13 విద్యాసంస్థల్లో ఈ నెల 19వ తేదీలోగా పనులు పూర్తి చేయాలని సూచించారు. అలాగే జిల్లాలోని మిగిలిన 37 విద్యాసంస్థలు, రెసిడెన్షియల్ పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లను పర్యావరణ హిత కేంద్రాలుగా అభివృద్ధి చేయడానికి అవసరమైన చర్యలను వేగవంతం చేయాలని ఆదేశించారు. నెట్ జీరో ఎనర్జీ లక్ష్యంతో నెడ్‌క్యాప్ ద్వారా సోలార్ ప్యానెల్‌ల ఏర్పాటు చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. జీవ వైవిధ్యాన్ని పెంపొందించేలా వివిధ రకాల మొక్కల పెంపకానికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ట్రైబల్, ఎస్సీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖలకు చెందిన విద్యాసంస్థల్లో అవసరాలకు అనుగుణంగా మొక్కల పెంపకం చేపట్టాలని అధికారులకు తెలిపారు. బయో వేస్ట్, లిక్విడ్ వేస్ట్, గ్రీన్ వాటర్ నిర్వహణలో భాగంగా సోక్ పిట్లు, రైన్ వాటర్ హార్వెస్టింగ్ పిట్లు, గ్రే వాటర్ పిట్లు, కిచెన్ వేస్ట్ పిట్ల నిర్మాణాలను నెలాఖరులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఈ పనులను ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా, కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు పట్టణాల్లో మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టాలని సూచించారు. సమావేశంలో "కన్హా హార్ట్‌ఫుల్‌నెస్" సంస్థ మరియు రాష్ట్ర ప్రభుత్వం మధ్య నెట్ జీరో కార్యక్రమాల పర్యవేక్షణకు కుదిరిన ఒప్పంద పత్రాన్ని సంస్థ ప్రతినిధులు కళ్యాణ్, వెంకటరెడ్డి, గంగాధర్ జిల్లా కలెక్టర్‌కు అందజేశారు. ఈ సమావేశంలో డ్వామా పీడీ నర్సింహారెడ్డి, సోషల్ వెల్ఫేర్ అధికారి రాధిక, బీసీ వెల్ఫేర్ అధికారి ప్రసూన, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి సురేష్, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ మనోహర్, కర్నూలు మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేష్, సీపీఓ భారతి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ కిషోర్ రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

## హార్టికల్చర్ విస్తరణతో జిల్లా జీడీపీ పెంపుపై దృష్టి

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు కార్యాచరణ వేగవంతం చేయాలి

రైతుల ఆదాయాల పెంపే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

అనంత అరణ్య, జలధార–జలహారతి కార్యక్రమాలపై సమీక్ష

క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనులు చేపట్టాలని అధికారులకు ఆదేశం




**నంద్యాల, జూన్ 9 (కొత్తస్వరం) :**
జిల్లా ఆర్థికాభివృద్ధి, రైతుల ఆదాయాల పెంపు లక్ష్యంగా హార్టికల్చర్ విస్తరణతో పాటు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు ద్వారా జిల్లా జీడీపీని గణనీయంగా పెంచేందుకు అధికారులు క్షేత్రస్థాయిలో కార్యాచరణను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని ఎన్ఐసీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి ఎంపీడీఓలు, ఉపాధి హామీ, జలవనరులు తదితర శాఖల అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో హార్టికల్చర్ విస్తరణ, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల స్థాపన, అనంత అరణ్య (అల్ట్రా హై డెన్సిటీ ప్లాంటేషన్), జలధార–జలహారతి కార్యక్రమాల అమలుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వ్యవసాయానికి అనుబంధంగా హార్టికల్చర్ పంటల సాగును విస్తరించడం ద్వారా రైతులకు అధిక ఆదాయం లభించే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. అలాగే జిల్లాలో ఆహార ప్రాసెసింగ్ యూనిట్ల స్థాపనకు అనుకూల వాతావరణాన్ని కల్పించి, విలువ ఆధారిత ఉత్పత్తులను ప్రోత్సహించాలని అధికారులను ఆదేశించారు. అనంత అరణ్య కార్యక్రమంలో భాగంగా అల్ట్రా హై డెన్సిటీ ప్లాంటేషన్‌ను విస్తృతంగా చేపట్టి పచ్చదనాన్ని పెంపొందించడంతో పాటు రైతులకు అదనపు ఆదాయం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జలధార–జలహారతి కార్యక్రమాల అమలులో శాఖల మధ్య సమన్వయం పెంచి లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల సాధనకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి జిల్లా అభివృద్ధికి కృషి చేయాలని కలెక్టర్ జి. రాజకుమారి సూచించారు.

## మోహన్ నాయక్ ఆస్తులు వందకోట్లకు పైగానే

ఆరఅండ్‌బీ ఈఎన్‌సీ మోహన్ నాయక్ ఇంట్లో సోదాలు

భారీగా బంగారం, నగదు, ఆస్తులు గుర్తించిన ఎసిబి

కిలో బంగారం, 60 లక్షల నగదు స్వాధీనం

**హైదరాబాద్, జూన్ 9 (కొత్తస్వరం) :**
ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారనే ఆరోపణల నేపథ్యంలో రోడ్లు మరియు భవనాల శాఖ (ఆరఅండ్‌బీ) ఈఎన్‌సీ మోహన్ నాయక్ నివాసంతో పాటు ఆయనకు సంబంధించిన పలు ప్రాంతాల్లో అవినీతి నిరోధక శాఖ అధికారులు విస్తృత స్థాయిలో సోదాలు చేపట్టారు. హైదరాబాద్ లోని ఆయన నివాసంలో ఉదయం నుంచి తనిఖీలు కొనసాగాయి. మోహన్ నాయక్ ఈఎన్‌సీ హోదాలో ఉన్న సమయంలో వందల కోట్ల రూపాయల విలువైన ఆస్తులను కూడబెట్టినట్లు ఆరోపణలు రావడంతో ఏసీబీ అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలో హైదరాబాద్‌తో పాటు పలు ప్రాంతాల్లో మొత్తం 11 చోట్ల ఏకకాలంలో దాడులు చేపట్టారు. మియాపూర్ లోని ఓ గేటెడ్ కమÖ్యనిటీలో ఉన్న విల్లా నంబర్`98లో డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ఏసీబీ బృందాలు సోదాలు నిర్వహించాయి. భద్రతా కారణాల దృష్ట్యా అధికారుల అనుమతి లేకుండా ఎవరినీ లోపలికి అనుమతించ లేదు. సోదాల సందర్భంగా పలు కీలక పత్రాలు, ఆస్తులకు సంబంధించిన డాక్యుమెంట్లు, నగదు, బంగారు ఆభరణాలను అధికారులు గుర్తించినట్లు సమాచారం. ప్రాథమిక సమాచారం ప్రకారం.. రోడ్ల నిర్మాణాలకు సంబంధించిన టెండర్ల కేటాయింపుల్లో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినట్లు మోహన్ నాయక్‌పై గతంలోనే పలు ఆరోపణలు వచ్చాయి. ముఖ్యంగా కాంట్రాక్టర్లకు టెండర్లు కేటాయించే ప్రక్రియలో అక్రమాలకు పాల్పడినట్లు వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా ఏసీబీ విచారణ చేపట్టినట్లు తెలుస్తోంది. సోదాలు ఇంకా కొనసాగుతున్న నేపథ్యంలో పూర్తి స్థాయి లెక్కలు, స్వాధీనం చేసుకున్న ఆస్తుల విలువపై అధికారిక వివరాలు వెల్లడించాల్సి ఉంది. సాయంత్రం వరకు ఈ తనిఖీలు కొనసాగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. సోదాలు పూర్తయిన అనంతరం కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను ఏసీబీ వెల్లడించనున్నారు. మోహన్ నాయక్ ఇంటితోపాటు 15 ప్రాంతాల్లోని ఆయన బంధువుల నివాసాల్లో ఏకకాలంలో తనిఖీలు చేపట్టారు. అతడి ఇంట్లో 20కి పైగా విదేశీ మద్యం సీసాలను గుర్తించారు. మంగళవారం ఉదయం నుంచి తనిఖీలు కొనసాగుతున్నాయని, సోదాలు పూర్తయిన తర్వాత వివరాలు వెల్లడిస్తామని ఏసీబీ అధికారులు తెలిపారు. మోహన్ నాయక్ ఇంట్లో చేపట్టిన తనిఖీల్లో రూ.60లక్షల నగదు గుర్తించినట్లు ఏసీబీ జాయింట్ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్ వెల్లడించారు. కిలో బంగారు నగలు, 13 బంగారు బిస్కెట్లు గుర్తించినట్లు తెలిపారు. హైదరాబాద్, నిజామాబాద్‌లో ఇళ్ల స్థలాల పత్రాలు గుర్తించామని తెలిపారు. మరోవైపు, మోహన్ నాయక్ కార్యాలయంలోనూ ఏసీబీ సోదాలు జరిపింది. ఎర్రమంజిల్‌లోని కార్యాలయంలో పలు ఫైళ్లను తనిఖీ చేస్తున్నారు. అక్కడి అధికారుల నుంచి కూడా వివరాలు సేకరిస్తున్నారు. అతడి ఆస్తుల విలువ రూ.100 కోట్లకు పైనే ఉంటుందని ఏసీబీ అంచనా వేస్తోంది.

## ఆగస్టు నాటికి ఎన్హైచ్-340సీ విస్తరణ పనులు పూర్తి చేయాలి






సంబంధిత అధికారులకు జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి ఆదేశాలు

9 కిలోమీటర్ల ప్రాజెక్టులో 7.5 కిలోమీటర్ల పనులు పూర్తి

మిగిలిన పనుల్లో వేగం పెంచాలని సూచన

ఆలయ ప్రాంత సమస్యను పరస్పర అవగాహనతో పరిష్కరించాలి

ప్రాజెక్టు పూర్తితో రవాణా సౌకర్యాలు మెరుగుపడనున్నాయి

**కర్నూలు, జూన్ 9 (కొత్తస్వరం) :**
ఎన్హైచ్–340సీ రహదారి విస్తరణ పనులను ఆగస్టు నాటికి పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో నంద్యాల చెక్‌పోస్ట్ నుంచి నందికొట్కూరు రోడ్డు వరకు చేపడుతున్న ఎన్హైచ్–340సీ విస్తరణ పనుల పురోగతిపై అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మొత్తం 9 కిలోమీటర్ల రహదారి విస్తరణ ప్రాజెక్టులో ఇప్పటివరకు సుమారు 7.5 కిలోమీటర్ల పనులు పూర్తయ్యాయని తెలిపారు. మిగిలిన 1.5 కిలోమీటర్ల విభాగంలో జరుగుతున్న పనుల్లో మరింత పురోగతి సాధించాలని అధికారులను ఆదేశించారు. మిగిలిన భాగంలో సుమారు ఒక కిలోమీటరు మేర పనులు కొనసాగుతున్నాయని, మరో 500 మీటర్ల విభాగంలో కేవలం 300 మీటర్ల ప్రాంతం మాత్రమే సమస్యాత్మకంగా ఉందని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ప్రాజెక్టు పరిధిలోని ఆలయ ప్రాంతం కారణంగా కొంత ఆలస్యం జరుగుతోందని అధికారులు తెలియజేయగా, స్థానిక ప్రజల అభిప్రాయాలను గౌరవిస్తూ పరస్పర అవగాహనతో సమస్యను పరిష్కరించి పనులను పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ ప్రాజెక్టు పూర్తయిన అనంతరం ప్రాంతీయ రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు ప్రజలకు మరింత సౌకర్యవంతమైన ప్రయాణ వసతులు అందుబాటులోకి వస్తాయని కలెక్టర్ పేర్కొన్నారు. సమావేశంలో కర్నూలు మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేసు, నేషనల్ హైవేస్ కర్నూలు ఈఈ విజయభాస్కర్ రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

## రేవంత్ రెడ్డికి ప్రాజెక్టులు ఏటీఎంలుగా మారాయి: రాంచందర్ రావు

**భువనగిరి, జూన్ 9 (కొత్త స్వరం):**
తెలంగాణలో ధాన్యం కొనుగోలు వ్యవహారంపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. మంగళవారం భువనగిరిలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ధాన్యం దిగుబడుల అంచనాల రూపకల్పనలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. కేంద్రానికి సరైన ఇండెంట్ పంపకపోవడం వల్లే సమస్యలు తలెత్తాయని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను కేంద్ర ప్రభుత్వం నిర్వహించదని, రాష్ట్రాలు కొనుగోలు చేసిన ధాన్యానికి కేంద్రం రీయింబర్స్‌మెంట్ అందిస్తుందని స్పష్టం చేశారు. రైతులను తప్పుదారి పట్టించేలా కేంద్రంపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించిన రాంచందర్ రావు, రైతుల సమస్యలను పక్కనబెట్టి ప్రభుత్వం ప్రజలను మభ్యపెడుతోందని విమర్శించారు. పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, మూసీ ప్రక్షాళన ప్రాజెక్టులు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డికి 'ఏటీఎంలుగా' మారాయని ఆరోపించారు. కాళేశ్వరం అవినీతి వ్యవహారంలో మాజీ ముఖ్యమంత్రి ఎన్. రాంచందర్ రావును కాపాడేందుకే ప్రభుత్వం కాలయాపన చేస్తోందని రాంచందర్ రావు ఆరోపించారు.

## ఓజీ గంజాయి స్మగ్లింగ్ ముఠా బట్టబయలు

### జూనియర్ ఆర్టిస్ట్ దొడ్డి సూరి కళ అరెస్ట్

**హైదరాబాద్, జూన్ 9 (కొత్త స్వరం):**
హైదరాబాద్‌లో అంతర్జాతీయ మాదకద్రవ్యాల అక్రమ రవాణా ముఠాను ఈగల్ ఫోర్స్ తెలంగాణ, కస్టమ్స్ విభాగం, నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సీబీ) సంయుక్తంగా ఛేదించాయి. బ్యాంకాక్–భారత్ మార్గంలో సాగుతున్న ఓజీ గంజాయి స్మగ్లింగ్ వ్యవహారాన్ని వెలికితీసి కీలక నిందితులను గుర్తించాయి. ఈ కేసులో హైదరాబాద్‌కు చెందిన జూనియర్ ఆర్టిస్ట్ దొడ్డి సూరి కళను శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో అరెస్ట్ చేశారు. ఆమె వద్ద నుంచి 2.15 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. బ్యాంకాక్ నుంచి హైదరాబాద్‌కు చేరుకున్న సమయంలో నిర్వహించిన తనిఖీల్లో మాదకద్రవ్యాలు బయటపడ్డాయి. దర్యాప్తులో కేరళకు చెందిన చల్లిల్ పుత్తన్‌పురయిల్ నఫీద్ అలియాస్ అలెక్స్ ఈ ముఠాకు ప్రధాన సూత్రధారిగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. మహిళా జూనియర్ ఆర్టిస్టులకు ఒక్కో ట్రిప్‌కు రూ.20 వేల వరకు పారితోషికం ఇస్తామని ఆశ చూపించి డ్రగ్స్ రవాణాకు వినియోగిస్తున్నట్లు వెల్లడైంది. పోలీసుల విచారణలో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. 2026 మార్చిలో సూరి కళ తొలిసారిగా బ్యాంకాక్ వెళ్లి గంజాయిని భారత్‌కు తీసుకువచ్చి చెన్నైలో ముఠా సభ్యులకు అప్పగించినట్లు తేలింది. అనంతరం ఏప్రిల్‌లో మరోసారి బ్యాంకాక్ వెళ్లి మాదకద్రవ్యాలను హైదరాబాద్‌కు తీసుకొచ్చినట్లు గుర్తించారు. జూన్‌లో మూడోసారి అదే తరహా ప్రయత్నం చేస్తుండగా కస్టమ్స్ అధికారులు ఆమెను అదుపులోకి తీసుకున్నారు. ఈ ముఠాలో రాజు బిస్వాస్ కీలక పాత్ర పోషించినట్లు దర్యాప్తులో తేలింది. గంగా భవాని, గౌరి అనే మరో ఇద్దరు మహిళలను కూడా బ్యాంకాక్‌కు పంపించి గంజాయి రవాణా చేయించినట్లు అధికారులు గుర్తించారు. మహిళా ఆర్టిస్టులను ఎరగా ఉపయోగించి అంతర్జాతీయ స్థాయిలో డ్రగ్స్ స్మగ్లింగ్ నిర్వహిస్తున్న ఈ నెట్‌వర్క్‌పై అధికారులు మరింత లోతైన దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఆర్థిక లావాదేవీలు, విదేశీ సంబంధాలు, ఇతర సభ్యుల పాత్రపై విచారణ జరుగుతోంది. 2.15 కిలోల గంజాయితో పాటు అంతర్జాతీయ డ్రగ్స్ రాకెట్‌కు సంబంధించిన కీలక ఆధారాలు కూడా స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు వెల్లడించారు.

Edited, Printed, Published by **KEDEM RAVI RAJU,** Printed at 3-151, DAMAGATLA NANDIKOTKURU, KURNOOL, ANDHRA PRADESH - 518432, **VSAR PUBLICATIONS,** 91/4-31-3-1B, BALAJINAGAR, KURNOOL, ANDHRA PRADESH - 518006, A.P., Editor : **KEDEM RAVI RAJU**, Cell No. 9912213364, Email:kothaswaram2024@gmail.com, **PRGI No. APTEL/2010/31893**, WebSite : www.kothaswaram.com

కొత్తస్వరం
తెలుగు దిన పత్రిక
https://kothaswaram.com
5
బుధవారం
జూన్ 9, 2026





# డంపింగ్ యార్డు ఎత్తివేతకు జూలై 26న భారీ సదస్సు

**జవహర్‌నగర్, జూన్ 9 (కొత్త స్వరం):**

జవహర్‌నగర్ డంపింగ్ యార్డును వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ జూలై 26న భారీ సదస్సు నిర్వహించనున్నట్లు డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాట కమిటీ ప్రకటించింది. మంగళవారం ప్రగతినగర్‌లో జరిగిన కో–కన్వీనర్ల సమావేశంలో చైర్మన్ షేక్ షావలి, కన్వీనర్ ఉమామహేష్ అధ్యక్షతన భవిష్యత్ కార్యాచరణపై పలు తీర్మానాలు చేశారు. ప్రజల ఆరోగ్యం, జీవన హక్కులను దెబ్బతీస్తున్న డంపింగ్ యార్డును ప్రభుత్వం వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 15న మేడ్చల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని ప్రజావాణిలో, 23న ప్రజాభవన్‌లో వినతిపత్రాలు సమర్పించాలని నిర్ణయించారు. అలాగే జూలై మొదటి వారం నుంచి డంపింగ్ యార్డు ప్రభావిత గ్రామాలు, కాలనీల్లో పాదయాత్రలు నిర్వహించి ప్రజలను చైతన్యపరచనున్నట్లు తెలిపారు. జూలై 26న పర్యావరణ నిపుణులు, శాస్త్రవేత్తలు, ప్రజాసంఘాల ప్రతినిధులతో వెయ్యి మందికి పైగా పాల్గొనే భారీ సదస్సు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. డంపింగ్ యార్డు బాధితులు, ప్రజాస్వామ్యవాదులు, ప్రజాసంఘాలు ఈ ఉద్యమానికి మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు.

# తలారి హరికృష్ణ ముదిరాజ్‌ది ముమ్మాటికీ హత్యే!

**నిందితులను గుర్తించి వెంటనే అరెస్ట్ చేయాలని ప్రజాసంఘాల డిమాండ్**

**పోలీసుల నిర్లక్ష్యంపై మండిపడ్డ ముదిరాజ్, దళిత, మైనార్టీ సంఘాల నేతలు**

**అధికార రాజకీయ నాయకుల అండతోనే దర్యాప్తు మందగిస్తోందని ఆరోపణ**

**బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామన్న నాయకులు**

**జూన్ 11న తాండూర్ ఆర్డీవో కార్యాలయం ఎదుట భారీ ధర్నాకు పిలుపు**




**తాండూర్, జూన్ 9 (కొత్త స్వరం):**

బషీరాబాద్ మండలం జీవనిగి గ్రామానికి చెందిన యువకుడు తలారి హరికృష్ణ ముదిరాజ్ మృతి కేసులో నిందితులను వెంటనే గుర్తించి అరెస్ట్ చేయాలని ముదిరాజ్ సంఘం, దళిత, మైనార్టీ, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. హరికృష్ణ మృతి ముమ్మాటికీ హత్యేనని ఆరోపిస్తూ, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. మంగళవారం తాండూరులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, అధికార రాజకీయ నాయకుల అండతోనే పోలీసులు ఈ కేసు విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయడంలో పోలీసు యంత్రాంగం విఫలమైందని విమర్శించారు. తలారి హరికృష్ణ (తండ్రి: టి. నర్సిములు) ఈ ఏడాది ఏప్రిల్ 29న పని నిమిత్తం రుద్రారం గ్రామానికి వెళ్లగా, అదే రోజు మధ్యాహ్నం అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు తెలిపారు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ, వారు సరైన రీతిలో స్పందించలేదని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా, సంఘటనా స్థలంలో కీలక ఆధారాలను సేకరించడంలో పోలీసులు విఫలమయ్యారని, నిందితులను గుర్తించి అరెస్ట్ చేయాల్సిన స్థానంలో వారిని కాపాడే విధంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు ముదిరాజ్ సంఘం, దళిత, మైనార్టీ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పోరాటం కొనసాగిస్తామని నాయకులు స్పష్టం చేశారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తాండూర్ పట్టణ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు రమేష్ ముదిరాజ్, సీఐటీయూ ప్రధాన కార్యదర్శి కె. శ్రీనివాస్, టీఎస్ఎంఎస్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ వాహెబ్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు కే. చంద్రయ్య, కెవిపీఎస్ నాయకుడు గుమ్మడి రత్నం, టీఎస్ ఎంఎస్పీఎస్ తాండూర్ పట్టణ ఇన్‌చార్జ్ మొహమ్మద్ సాధిఖ్, ఎంఆర్పీఎస్ తాండూర్ టౌన్ అధ్యక్షుడు బలరాం, మంతట్టి రాజు ముదిరాజ్, శానప్ప ముదిరాజ్, శ్రీకాంత్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు. ఒకవేళ నిందితులను వెంటనే గుర్తించి అరెస్ట్ చేయకపోతే, జూన్ 11న తాండూర్ ఆర్డీవో కార్యాలయం ముందు భారీ ధర్నా నిర్వహిస్తామని ప్రజాసంఘాల నాయకులు హెచ్చరించారు.

# ఓగిపూర్‌లో 'ప్రొఫెసర్ జయ శంకర్ బడిబాట' ప్రారంభం




**తాండూరు, జూన్ 9 (కొత్త స్వరం):**

తాండూరు మండలం ఓగిపూర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 'ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట' కార్యక్రమాన్ని మంగళవారం ప్రధానోపాధ్యాయులు రాము ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడిన ఆయన, కొత్త విద్యా సంవత్సరంలో పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందుబాటులో ఉన్న సౌకర్యాలు, క్రమశిక్షణ, నాణ్యమైన విద్య గురించి వివరించారు. విద్యార్థులకు అందజేసే రెండు జతల యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు, పౌష్టికాహారం తదితర సంక్షేమ కార్యక్రమాల గురించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్. రాములు, ప్రీ–ప్రైమరీ టీచర్ భాగ్యశ్రీ, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# బషీరాబాద్‌లో సినిమా సందడి

**'లివింగ్ లెజెన్స్' షూటింగ్‌లో విద్యార్థి కిడ్నాప్ సన్నివేశం చిత్రీకరణ**


**దర్శకుడు శ్రీ వరదరాజు ఆధ్వర్యంలో కొనసాగుతున్న చిత్రీకరణ**


**పోలీస్ స్టేషన్ ఎదుట, పురాతన భవనంలో కీలక సన్నివేశాలు**

**షూటింగ్ వీక్షించేందుకు భారీగా తరలివచ్చిన స్థానికులు**

**జీవన్గి గ్రామంలోనూ తదుపరి చిత్రీకరణ**







**బషీరాబాద్, జూన్ 9 (కొత్త స్వరం):**

బషీరాబాద్ మండల కేంద్రంలో మంగళవారం సినిమా షూటింగ్ సందడి నెలకొంది. 'లివింగ్ లెజెన్స్' సినిమా చిత్రీకరణలో భాగంగా పాఠశాల నుంచి ఇంటికి తిరిగి వెళుతున్న ఓ విద్యార్థిని వ్యాన్‌లో వచ్చిన కొందరు వ్యక్తులు ముసుగులు ధరించి కిడ్నాప్ చేసే సన్నివేశాన్ని చిత్రబృందం చిత్రీకరించింది. ఈ షూటింగ్‌ను స్థానిక పోలీస్ స్టేషన్ ఎదుటతో పాటు మండల కేంద్రంలోని పాత ఎమ్మార్వో కార్యాలయ భవనంలో నిర్వహించారు. చిత్రీకరణను వీక్షించేందుకు స్థానికులు, యువత పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సన్నివేశాలను సహజత్వానికి దగ్గరగా తెరకెక్కించడంతో ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా దర్శకుడు శ్రీ వరదరాజు మాట్లాడుతూ, కథకు కీలకమైన మరికొన్ని సన్నివేశాలను బషీరాబాద్ పరిసర ప్రాంతాలతో పాటు జీవన్గి గ్రామంలో కూడా చిత్రీకరించనున్నట్లు తెలిపారు. సినిమా షూటింగ్ కారణంగా కొంతసేపు మండల కేంద్రంలో సందడి వాతావరణం నెలకొంది. చిత్రీకరణకు సహకరించిన స్థానిక ప్రజలకు చిత్రబృందం కృతజ్ఞతలు తెలిపింది. ఎలాంటి అవాంతరాలు లేకుండా షూటింగ్ ప్రశాంతంగా ముగిసినట్లు చిత్రబృందం వెల్లడించింది.

# ఓటు హక్కు పరిరక్షణలో బీఎల్ఏల పాత్ర కీలకం







**ఎస్ఐఆర్‌పై అప్రమత్తంగా ఉండాలి: ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి**

**తాండూరులో నియోజకవర్గ స్థాయి శిక్షణ శిబిరం విజయవంతం**

**అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా చర్యలు**

**ఓటరు జాబితా సవరణపై పూర్తి అవగాహన అవసరం**

**అక్రమాలు, పొరపాట్లకు తావులేకుండా క్షేత్రస్థాయిలో పనిచేయాలి**

**తాండూరు, జూన్ 9 (కొత్త స్వరం):**

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, దాని పరిరక్షణలో బూత్ లెవల్ ఏజెంట్ల (బీఎల్ఏలు) పాత్ర ఎంతో కీలకమని తెలంగాణ రాష్ట్ర కన్వీనర్, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు వికారాబాద్ జిల్లా తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో, ఎస్ఐఆర్ కన్వీనర్ కరణం పురుషోత్తం రావు పర్యవేక్షణలో మంగళవారం నియోజకవర్గ స్థాయి ఎస్ఐఆర్ శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ హ్యాండ్లూమ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీహెచ్‌డీసీ) చైర్మన్ దూడం వెంకట రమణ, వికారాబాద్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు ధారాసింగ్‌లతో కలిసి రామ్మోహన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై బీఎల్ఏలు పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. జూన్ 15 నుంచి జూలై 14 వరకు జరిగే ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో ఓటరు ధృవీకరణ, కుటుంబ వివరాల పరిశీలన, ముసాయిదా ఓటరు జాబితా తనిఖీ, దరఖాస్తులు, అభ్యంతరాల నమోదు తదితర అంశాలపై పూర్తి పట్టు సాధించాలని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా చూడటంతో పాటు, అర్హత లేని వ్యక్తులు లేదా ఆ ప్రాంతంలో నివసించని వారి పేర్లు నమోదు కాకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. గ్రామ స్థాయి నాయకులు, కార్యకర్తలు, బూత్ స్థాయి బాధ్యులతో సమన్వయం చేసుకుంటూ క్షేత్రస్థాయిలో పనిచేయాలని, ప్రభుత్వ అధికారులు, బూత్ స్థాయి అధికారులతో నిరంతరం సంబంధాలు కొనసాగించాలని తెలిపారు. ఓటర్ల జాబితా సవరణలో ఎలాంటి పొరపాట్లు, అక్రమాలు చోటుచేసుకోకుండా ప్రతి కార్యకర్త బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ఎక్కడైనా సమస్యలు ఎదురైతే వెంటనే పార్టీ నాయకత్వం దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పట్లోళ్ల నీరజా బాల్‌రెడ్డి, మాజీ చైర్‌పర్సన్ స్వప్న పరిమళ్, తాండూరు మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల నర్సింలు, మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్దుల్ రజాక్, డీసీసీబీ మాజీ చైర్మన్ లక్ష్మారెడ్డి, నాయకులు ఉత్తమ్ చంద్, గాజీపూర్ నారాయణరెడ్డి, నర్సిరెడ్డి, వడ్డె శ్రీనివాస్, కావలి సంతోష్ కుమార్, బాతుల నాగరాజు, రాజ్ కుమార్, మహిపాల్ రెడ్డి, రాజవర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





# కాప్రా తహసీల్దార్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన బొంతు శ్రీదేవి యాదవ్

**కాప్రా, జూన్ 9 (కొత్త స్వరం):**

కాప్రా మండల నూతన తహసీల్దార్ మతీన్‌ను చర్లపల్లి డివిజన్ మాజీ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు పూలమొక్కను అందజేశారు. చర్లపల్లి డివిజన్ పరిధిలోని ప్రజల రెవెన్యూ, భూ సంబంధిత సమస్యలను తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లిన శ్రీదేవి యాదవ్, కుల, ఆదాయ, కుటుంబ ధృవీకరణ పత్రాలను జాప్యం లేకుండా జారీ చేయాలని కోరారు. డివిజన్ అభివృద్ధికి, ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత వేగంగా అందేలా రెవెన్యూ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాప్రా డివిజన్ మాజీ కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి, స్థానిక నాయకులు, కార్యకర్తలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# లోకేశ్ నియంతలా వ్యవహరిస్తున్నారు: గుడివాడ అమర్‌నాథ్

**విశాఖపట్నం, జూన్ 9 (కొత్త స్వరం):**

విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రమాద ఘటన నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ కూటమి ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. మంత్రి నారా లోకేష్ నియంతలా వ్యవహరిస్తున్నారని ఆరోపించిన ఆయన, కేజీహెచ్ వద్ద న్యాయం కోరిన కార్మిక సంఘాలను బెదిరించే ధోరణిలో మాట్లాడటం దుర్మార్గమని విమర్శించారు. రాష్ట్రంలో 'రెడ్‌బుక్' అరాచకం నడుస్తోందని కూడా వ్యాఖ్యానించారు. స్టీల్ ప్లాంట్ బాధిత కుటుంబాలకు తక్షణమే కోటి రూపాయల చొప్పున పరిహారం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. కార్మికుల సంక్షేమాన్ని ప్రభుత్వం పూర్తిగా గాలికొదిలేసిందని ఆరోపించారు. ఇదే అంశంపై అరకు ఎంపీ ఎం. తను శ్రీ రాణి కూడా స్పందిస్తూ, ప్రమాదంపై కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాలు సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం, ఒక కుటుంబ సభ్యుడికి ఉద్యోగం కల్పించాలని ఆమె కోరారు.



# మెరుగు శివకృష్ణ చొరవతో దివ్యాంగునికి కృత్రిమ కాలు అందజేత

**ప్రమాదంలో కాలు కోల్పోయిన దస్తగిరికి కొత్త జీవన ఆశ**

**భారత్ వికాస్ పరిషత్ ట్రస్ట్ సహకారంతో ఆర్టిఫిషియల్ లెగ్ అందజేత**

**దివ్యాంగులకు అండగా నిలవాలని దాతలకు పిలుపు**

**సేవా కార్యక్రమంలో పలువురు ప్రముఖుల పాల్గొనడం**

**మేడ్చల్–మల్కాజ్గిరి, జూన్ 9 (కొత్త స్వరం ప్రతినిధి):**

కుత్బుల్లాపూర్‌కు చెందిన దస్తగిరి ప్రమాదంలో తన కుడి కాలును కోల్పోయి చాలా కాలంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ జీవనం సాగిస్తున్నారు. రోజువారీ పనులు చేసుకోవడంలోనూ ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆయన పరిస్థితిని తెలుసుకున్న తెలంగాణ వికలాంగుల హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెరుగు శివకృష్ణ వెంటనే స్పందించారు. దస్తగిరికి అవసరమైన సహాయం అందించేందుకు భారత్ వికాస్ పరిషత్ వికలాంగుల పునర్వసతి కేంద్రం ట్రస్ట్‌ను సంప్రదించి, కృత్రిమ కుడి కాలు (ఆర్టిఫిషియల్ రైట్ లెగ్) అందేలా చర్యలు చేపట్టారు. శివకృష్ణ చొరవతో దస్తగిరికి కృత్రిమ కాలు అందడంతో ఆయన జీవితంలో కొత్త ఆశలు చిగురించాయి. దీంతో రోజువారీ పనులను మరింత సులభంగా నిర్వహించుకునే అవకాశం లభించింది. ఈ కార్యక్రమానికి కూకట్‌పల్లి న్యూ శక్తి దివ్యాంగుల సంఘం ప్రధాన కార్యదర్శి టి. చిరంజీవి, జవహర్‌నగర్ బలగం టీవీ సీఈవో చింతల విజయ్‌కుమార్, స్టార్ న్యూస్ టీవీ–9 ప్రతినిధి జినుక రఘు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అలాగే భారత్ వికాస్ ట్రస్ట్ మేనేజర్ నరేంద్ర, మీడియా ప్రతినిధులు సంధ్య, టెక్నీషియన్‌లు రఘు, మధు, స్వామి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మెరుగు శివకృష్ణ మాట్లాడుతూ, సమాజంలో ఇంకా అనేక మంది దివ్యాంగులు సహాయం కోసం ఎదురుచూస్తున్నారని అన్నారు. దాతలు ముందుకు వచ్చి పేద కుటుంబాలకు చెందిన దివ్యాంగులకు విద్య, ఉపాధి, వైద్యం, వివాహం వంటి అంశాల్లో ఆర్థిక సహాయం అందించాలని కోరారు. ఈ సేవా కార్యక్రమానికి సహకరించిన భారత్ వికాస్ ట్రస్ట్‌కు వికలాంగుల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అవసరంలో ఉన్న ప్రతి దివ్యాంగుడికి అండగా నిలవడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన పేర్కొన్నారు.

